సంవత్సరాలు ఎంతో నమ్మకంగా పనిచేయటం వలన తననే క్యాషియర్‌ని చేశాడు. అతనింకో పెద్ద హోటల్ పెట్టడం వలన దానిని తను చూసుకుంటూ ఈ హోటల్ బాధ్యతంతా తనకే అప్పజెప్పాడు. తమ్ముళ్ల విషయంలో తన నమ్మకం వమ్ము అయినా యజమాని విషయంలో మాత్రం వమ్ముకాలేదు. యజమాని తనను చూడగానే ఆప్యాయంగా పలకరించాడు. ఇంకో నెల విశ్రాంతి తీసుకొనమని పదివేల రూపాయలివ్వటమే గాక ఖాళీగా ఉన్న తమ ఇంటి ఒక పోర్షన్‌లో ఉండమన్నాడు. 'నీ విషయాలన్నీ ఎప్పటికప్పుడు నాకు తెలుస్తూనే ఉన్నాయి. కానీ నీ వ్యక్తిగత విషయాలలో తలదూర్చటం సభ్యతనిపించుకోదు కనుక నీ భార్య నిన్ను వదిలిపోయినప్పుడే నిన్ను మందలించుదామన్న ఆలోచనను విరమించుకున్నాను. అప్పుడు నువ్వు పొరపాటు చేశావు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ భార్యను చేరదీయి. ఆమెని ఆదరించు' అన్న మాటలకు తన కళ్లల్లో నీళ్లే సమాధానమయ్యాయి.

"నువ్వేం బాధపడకు. నీ భార్య ఎక్కడుందో అనేగా నీ దిగులు. ఆమె ఆ రోజు నేరుగా నా దగ్గరకే వచ్చింది. నీ అంతట నీవు ఆమెను కోరుకునే వరకు నన్ను ఆ ప్రస్థావన తేవద్దంది. మీరిద్దరూ ఎంతో మంచివాళ్లు. పట్టుదలలు మాని ఇకనైనా సంతోషంగా ఉండండి. వేరెవరి కోసమో మీరిద్దరూ విడిపోవటం సమంజసం కాదు" అన్నాడు.

తననుండమన్న ఇంటి వాకిటిలోనే తన భార్య కనిపించింది. ఇద్దరికి ఒకరినొకరు చూసిన ఆనందంలో మాటలు కరువయ్యాయి. క్షమించమని కళ్లతోనే అడిగాడు. ఆమె ఆనందంగా అతనికి ఆసరా అయి లోనికి నడిపించింది.

'హోటల్ యజమాని ఈ హోటల్ నువ్వు కొనుక్కో. అవసరమైన ధనం బ్యాంకు లోను నుంచి పొందవచ్చని' బ్యాంకు లోన్ ఇప్పించాడు. ఆ హోటల్ త్వరగానే తన సొంతమయ్యింది. భార్య, హోటల్ తన లోకమయ్యాయి. చిన్ననాడు ఆశపడిన సంగీత, సాహిత్యాలకు తన జీవితంలో స్థానం కల్పించాలని ఆశించి భార్య సలహాతో ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి అందులో ఒక భాగంలో 'కవికోకిల' అనే సాహిత్య పత్రికను ప్రారంభించాడు. సంగీత సాహిత్యాల వలె ఆ దంపతులిరువురు తమ కలలను సాకారం చేసుకున్నారు.

**-ఇరపని మాధవి** (గుంటూరు)

★ ★ ★

# ఊరు రమ్మంటోంది

**విశాలమైన భవంతిలో దూదిపింజ లాంటి పరుపుమీద పడుకున్న పరంధామయ్య ఏదో ఆలోచిస్తున్నాడు. అంత విశాలమైన ఆ భవనం స్వర్గాన్ని తలపించే అధునాతన వసతులు అన్నీ అతనికి బంధనాలుగానే అగుపిస్తున్నాయి. మెత్తటి పరుపు ముళ్లపొదై తన శరీరంలో అణువణువులోకి గుచ్చుకుపోతున్నట్లుగా ఉంది. ఇది ఈ రోజు, నిన్నా కాదు. దాదాపు నెల రోజుల నుండి తన మనసులో రేగుతున్న అలజడి. అసంతృప్తి.**



ఏమండీ... ఇంకా నిద్రపట్టలేదా? అన్న భార్య మాటలకు ఆలోచనాస్రవంతి నుండి బయటకొచ్చాడు. లేదు జానకి. అన్నాడు ముభావంగా.

ఆమెకు తెలుసు అతనిలోని అశాంతికి కారణం.నెల రోజుల క్రితం తనకు ఇష్టం లేకున్నా సరే కొడుకుతో కలిసి పట్టుబట్టి మరీ తనను అమెరికాకు తీసుకొచ్చింది తను.

నాలుగు రోజుల పాటు కొడుకు హాయిగా కారులో ఊరంతా తిప్పి ఇలా నాలుగు గోడల స్వర్గమనబడే దాంట్లో బంధించాడు వాళ్లను.

పరంధామయ్యది తూర్పు గోదావరి జిల్లాలోని చిన్న పల్లెటూరు. వయసు అరవై దాటింది. ఊహ తెలిసిననాటి నుండి వ్యవసాయమే చేస్తూ తన భార్యాపిల్లలని పోషించాడు. ఉన్నంతలోనే కొడుకును బాగా చదివించి అమెరికాకు పంపాడు.

తండ్రి చిన్నప్పటి నుండి పడిన కష్టం చూడలేక కొడుకు శ్రీధర్ తల్లీతండ్రులని తన వద్దకు తెచ్చుకున్నాడు వాళ్లను ఇకనైనా సుఖపెట్టలనే ఆశతో.

అతనికి రోజులు యుగాలుగా గడుస్తున్నాయి. మాట్లాడ్డానికి అక్కడ మనుషుల్లేరు. పలకరించాలన్నా భాషా రాదు. బయటకెళ్దామంటే దిక్కూ తెలీదు. కాలు కాలిన పిల్లిలా ఇంట్లో నాలుగు గోడల మధ్య కాలక్షేపం చేస్తున్నాడు నెలరోజులుగా.

తన ఊర్లో పొలాలు, ఆవులు, గేదెలు గుర్తొచ్చాయ తనికి. తన ఊరి మట్టి, గాలి, ఆ మనుషులు, ఆ వాతావరణం అన్నీ తన రాకకై ఎదురుచూస్తున్నట్లనిపించింది. తన పలకరింపు కోసం వెయ్యి కళ్లతో నిరీక్షిస్తున్నట్లనిపించింది.

అన్నిటికన్నా తన ఇంట్లో దక్షిణ పక్క గదిలో పైకప్పు చూరు నుండి వర్షాకాలంలో టప్‌టప్‌మని కారే నీటి చుక్క గుర్తొచ్చింది. ఇప్పుడు తను లేక ఆ గది బోసిపోయిందేమో అనిపిస్తుందతనికి. చూరు నుండి కారే చినుకు చినుకు కన్నీరై బోరున విలపిస్తున్నట్లనిపించిందతనికి.

అదే అలవాటుగా పరుపుపై పడుకుని అందమైన రూఫ్‌కేసి చూస్తున్నాడు తదేకంగా పరంధామయ్య. నిద్ర వస్తుందా లేక, తన ఇంట్లో మాదిరే ఈ రూఫ్ కూడా ఎప్పటికైనా కారకపోతుందా అని ఆశగా.

అక్కడ ఇమడలేకపోతున్న పరంధామయ్యను ఊరు రమ్మంటోంది.

**-ఎస్.శేషగిరి** (హైదరాబాద్)